క్లుప్తంగా

నూతన హుండీల ఏర్పాటు



కానుకలతో నిండిన హుండీలను పక్కకు మళ్లిస్తున్న ఆలయ సిబ్బంది

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామివారి ఆలయానికి కార్తిక మాసం కావడంతో భక్తుల తాకిడి ఎక్కువగా ఉంది. దీంతో స్వామికి భక్తుల నుంచి వచ్చే ఆదాయం భారీగా పెరిగింది. ఈ కోవలోనే స్వామివారి ఆలయ గర్భగుడి వద్ద ఏర్పాటు చేసిన హుండీలు నగదుతో నిండిపోయాయి. దాంతో వాటిని పక్కకు పెట్టి వాటి స్థానంలో మరో రెండు హుండీలను ఆలయ ముఖద్వారం వద్ద ఏర్పాటు చేశారు.

కన్నులపండువగా అయ్యప్ప పడిపూజ



పెదపట్నంలంకలో అయ్యప్పస్వామికి నిర్వహిస్తున్న అభిషేకం

మామిడికుదురు: పెదపట్నంలంకలో అయ్యప్ప స్వామి పడి పూజ మంగళవారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. కొమ్ముల సాయిమణికంఠ ఆధ్వర్యంలో ఈ పూజ అత్యంత వైభవంగా జరిపించారు. మేళ తాళాలు, బాణసంచా కాల్పుల నడుమ అయ్యప్ప, భవానీ మాలధారులు నృత్యాలు చేస్తూ అయ్యప్పస్వామి విగ్రహాన్ని ఊరేగిస్తూ వైనతేయ నదికి వెళ్లి స్నానాలు ఆచరించారు. అక్కడి నుంచి వచ్చిన అనంతరం అయ్యప్ప స్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామి, కనకదుర్గమ్మ, అయ్యప్పస్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించిన అనంతరం 18 మెట్లుగా భావించి హారతి కర్పూరం వెలిగించి ఆధ్యాత్మిక గీతాలు ఆలపిస్తూ పేటతుళ్లి ఆడారు. కార్యక్రమం ఆద్యంతం వైభవంగా జరిగింది. కొమ్ముల సూరిబాబు దంపతులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో అయ్యప్ప, భవానీ మాలధారులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజ స్తంభం ప్రతిష్ఠ



ఆదుర్రు ధ్వజ స్తంభ ప్రతిష్ఠలో పాల్గొన్న రాజానగరం మాజీ ఎమ్మెల్యే రాజా



నర్సిపూడి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

మామిడికుదురు: వేదమంత్రాలు, హర హరా అంటూ భక్తుల శివనామ స్మరణ నడుమ ఆదుర్రులోని సర్వమంగళ పార్వతీ విశ్వేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం కన్నులపండుగలా జరిగింది. భారీ సంఖ్యలో భక్తులు ధ్వజ స్తంభ ప్రతిష్ఠలో పాల్గొన్నారు. కార్తిక శుద్ధ ద్వాదశి ఉదయం 6.51 గంటల శుభ ముహూర్తంలో ఈ ప్రతిష్ఠ ఘనంగా జరిపించారు. ధ్వజ స్తంభం కర్రదాత, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు చేశారు. బ్రహ్మశ్రీ ఉపాధ్యాయుల సూర్యనారాయణ మూర్తి, సుబ్బలక్ష్మి దంపతులచే ప్రతిష్ఠ మహోత్సవ పూజలు వైభవంగా నిర్వహించారు. పూజ్యం జగన్నాథశర్మ ఆధ్వర్యంలో పండితులు గణపతి పూజ, పుణ్యాహావాచనం, పంచగవ్య ప్రాశన, రత్నన్యాసం, పీఠన్యాసం, తదితర పూజలను జరిపించారు. యంత్ర స్థాపన, ధ్వజ స్తంభ స్థాపన, న్యాసాలు, దృష్టికుంభం, గోదర్శనం, కూష్మాండచ్ఛేదన తదితర పూజల్లో పలువురు ప్రముఖులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో కోటి దీపోత్సవం

ఆలమూరు: క్షీరాబ్ది ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని నర్సిపూడిలో కోటి దీపోత్సవం జరిగింది. స్థానిక ఊర చెరువు మధ్యలో నిర్మించిన శ్రీలక్ష్మి నారాయణ ఆలయంలో బుధవారం రాత్రి నిర్వహించిన ఈ కోటి దీపోత్సవానికి విశేష స్పందన లభించింది. కార్యక్రమానికి కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ప్రత్యేక అతిథిగా పాల్గొని వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా వైఎస్సార్‌సీపీ నేతల ఆధ్వర్యంలో నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. అలాగే పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులతో పాటు ఇతర మండలాల నుంచి అధిక సంఖ్యలో తరలి రావడంతో ఆప్రాంతమంతా జనసంద్రమైంది. చెరువు చుట్టూ ఏర్పాటు చేసిన కార్తిక దీపాలను భక్తులు వెలిగించారు. సర్పంచ్ కందిబొట్ల శ్రీనివాసు, ఎంపీటీసీ మేడిశెట్టి సుబ్బారావు పాల్గొన్నారు.

ఎక్సైజ్ దాడుల్లో ముగ్గురి అరెస్ట్

- 400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం.
- 33 మద్యం సీసాల స్వాధీనం



మండపేట మండలం చిన ద్వారపూడిలో సారా తరలిస్తున్న వ్యక్తులను అరెస్ట్ చేసిన ఎక్సైజ్ పోలీసులు

ఆలమూరు: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పరిధిలోని ఆలమూరు, మండపేట మండలాల్లోని వివిధ గ్రామాల్లో అనధికారికంగా బెల్టు షాపులు ఏర్పాటు చేసి మద్యం విక్రయిస్తున్న వ్యాపారులతో పాటు సారా తయారీ కేంద్రాలపై జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ బుధవారం దాడులు నిర్వహించింది. ఆలమూరు ఎక్సైజ్ సీఐ ఐడీ నాగేశ్వరరావు కథనం ప్రకారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఏఈఎస్ అమర్ బాబు ఆధ్వర్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ బృందాలు, స్థానిక ఎక్సైజ్ పోలీసులు విస్తృతంగా దాడులు చేశారు. ఈ దాడుల్లో చెముడులంక, బడుగువానిలంక, ఆలమూరు శివారు కొత్తూరు సెంటర్‌లో అనధికారికంగా నిర్వహిస్తున్న మూడు బెల్ట్ షాపులపై దాడి చేసి 33 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, బెల్ట్ షాపు నిర్వాహకులైన ఎస్.వెంకటేశ్వరావు, బి.పెంటయ్య, ఎల్.వీరభద్రరావులను అదుపులోకి తీసుకున్నారు. అలాగే మండపేట మండలం చిన్న ద్వారపూడిలో సారా బట్టీ నిర్వహిస్తున్నారని స్థానికులు ఇచ్చిన సమాచారంతో స్థానిక ఎక్సైజ్ పోలీసులు దాడులు చేశారు. ఈ దాడిలో సారా బట్టీ వద్ద ఉన్న 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి వంటపాత్రలను స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీదారుడైన కాండ్రేగుల శ్రీనివాస్‌పై కేసు నమోదు చేశారు. ఈ మేరకు ఏఈఎస్ అమర్‌బాబు ఆదేశాల మేరకు సీఐ నాగేశ్వరరావు దర్యాప్తు చేస్తున్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

ఆత్రేయపురం: మండలంలోని లొల్ల గ్రామంలో బుధవారం ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ కాత్యాయని ఆధ్వర్యంలో ఎక్సైజ్ సిబ్బంది దాడులు నిర్వహించారు. దాడుల్లో ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 16 క్వార్టర్ బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బెల్ట్ షాపులపై...

రాజోలు: బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న రాజోలు ఎక్సైజ్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. సఖినేటిపల్లి మండలం మోరిలో 18 , రాజోలు మండలం బి.సావరంలో ఐదు, మామిడికుదురు మండలం పెదపట్నంలో ఆరు మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని సీఐ కె.వీరబాబు తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సీహెచ్ లక్ష్మీతులసి, ఎస్సై సీహెచ్ స్వామి రెడ్డి పాల్గొన్నారు.

పశుగణనతో ఎంతో ఉపయోగం



గంగలకుర్రులో పశుగణన సర్వేను పరిశీలిస్తున్న డాక్టర్ వెంకట్రావు

అంబాజీపేట: పశుగణన చేయడం వల్ల ఎంత మంది రైతులు పాడి పరిశ్రమలపై ఆధారపడి ఉన్నారు. వారికి రాయితీలపై బడ్జెట్ రూపకల్పనకు ఎంతో ఉపయోగపడుతుందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఒ.వెంకట్రావు అన్నారు. గంగలకుర్రులో జరుగుతున్న పశుగణన కార్యక్రమాన్ని సహాయ సంచాలకుడు ఎల్.విజయసాయిరెడ్డి, స్థానిక పశువైద్యాధికారి డి.రాజేంద్రప్రసాద్‌లతో కలసి బుధవారం పరిశీలించారు. వెంకట్రావు మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 426 గ్రామాలకుగాను 282 మంది విషయ సేకరణ చేయుటకు నియమించి వారికి గుర్తింపు కార్డులు జారీ చేశామన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ఎన్ని ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు, కుక్కలు, గుర్రాలు, గాడిదలు, కోళ్లు, బాతులు, ఇతర జంతువుల యొక్క సమాచారాన్ని పూర్తి స్థాయిలో సేకరించాలని చెప్పామన్నారు. 2019 పశుగణన ప్రకారం 4,93,465 నివాస గృహాలు ఉన్నాయని, వాటన్నింటిని పశుగణన విషయ సేకరణదారులు వివరాలు సేకరించి, గుర్తుగా ఇంటి గుమ్మానికి కుడివైపున పశుగణన యొక్క చిహ్నాన్ని అతికిస్తారన్నారు. పశుగణనకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. దీనివలని పశుపోషణ, గొర్రెలు పెంపకం అధికంగా ఉన్న ప్రాంతాల్లో కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు, చిన్నచిన్న పరిశ్రమలకు ప్రోత్సాహకాలు, దాణ, పచ్చిమేతకు ఇవ్వవలసిన రాయితీపై ప్రణాళికలను రూపొందించుటకు అవకాశం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో పశు వైద్య సహాయకుడు శేఖర్ తదితరులు పాల్గున్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులు

మామిడికుదురు: విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని శరత్ చంద్ర ఫౌండేషన్ సీఈఓ కొమ్ముల రాణి ఉద్బోధించారు. పెదపట్నంలంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.హరనాథ్ అధ్యక్షతన జరిగిన సభలో 2023–24 విద్యా సంవత్సరం వార్షిక పరీక్షల్లో ప్రతిభ చూపిన 5 నుంచి పదో తరగతి వరకు చదువుతున్న 13 మంది విద్యార్థులకు రూ.24 వేల ఆర్థిక సాయం అందజేశారు. పదో తరగతి పరీక్షల్లో 600 మార్కులకు 590 మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన గిడుగు శ్రీరామదుర్గను ప్రత్యేకంగా సీఈఓ రాణి అభినందించారు. శరత్‌చంద్ర ఫౌండేషన్‌ను ఉపాధ్యాయులు, స్థానికులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీ రీ సర్వే ప్రాజెక్ట్ గ్రామ సభ



అంతర్వేదిపాలెంలో గ్రామ సభలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ భాస్కర్

సఖినేటిపల్లి: అంతర్వేదిపాలెం పంచాయతీ వద్ద సర్పంచ్ నల్లి లీలావతి అధ్యక్షతన బుధవారం ఏపీ రీ సర్వే ప్రాజెక్ట్ గ్రామ సభను అధికారులు నిర్వహించారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ సీహెచ్ భాస్కర్ మాట్లాడుతూ, గ్రామంలోని భూములన్నింటినీ రీ సర్వే చేసే నిమిత్తం తగిన సమాచారానికి రైతులతో గ్రామ సభ ఏర్పాటు చేశామన్నారు. గ్రామంలో భూములు కలిగి ఉన్న రైతులు అందరూ వారి భూములకు సంబంధించిన దస్తావేజులు, ఆధార్ కార్డు, రెండు ఫొటోలు, బ్యాంకు పాస్ బుక్ జెరాక్స్‌లు స్థానిక వీఆర్వోలకు అందజేయాలని భాస్కర్ సూచించారు. మండల సర్వేయర్ భద్రరాజు, వీఆర్వో తోట సత్యనారాయణ, రైతులు నల్లి సురేంద్ర, అల్లూరి సత్యనారాయణరాజు, అల్లూరు రవి రాజు, వీరా కర్ణుడు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.30,348 విరాళం

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి విశాఖపట్నానికి చెందిన మయూఖ కుటుంబ సభ్యులు బుధవారం రూ.10,116, విజయవాడకు చెందిన ముక్కవల్లి రవీంద్రనాథ్ రూ.10,116, రాజమహేంద్రవరానికి చెందిన శీలం వెంకటమోహన్–శ్రీదేవి దంపతులు రూ.10,116 విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును ఆలయ అర్చకులకు అందజేశారు. వీరికి ఆలయ వేదపండితులు, అర్చకులు స్వామి ఆశీర్వచనం అందజేసి స్వామి శేషవస్త్రాలు, స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

ఘనంగా రాధాకృష్ణుల కల్యాణం

ఆత్రేయపురం: గ్రామంలో వేంచేసిన వినాయక, రాధాకృష్ణ, వల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో మంగళవారం సాయంత్రం రాధాకృష్ణుల కల్యాణం కన్నులపండువగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వాడపల్లి సాయికుమార్, వాడపల్లి అనంత్‌కుమార్‌ల ఆధ్వర్యంలో మాజీ ఉప సర్పంచ్ చిలువూరి చిన వెంకట్రాజు–నాగమణి దంపతులు స్వామికి పట్టు వస్త్రాలను సమర్పించి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ నిర్వాహకులు పర్యవేక్షించారు.

వసతి సౌకర్యంపై ఎంపీకి వినతి

మలికిపురం: జనవరి 9, 10, 11 తేదీల్లో ఢిల్లీలో జరిగే అంతర్జాతీయ ఫొటోగ్రఫీ ఎగ్జిబిషన్‌కు కోనసీమ జిల్లా ఫొటోగ్రాఫర్లకు వసతి సౌకర్యం కల్పించాలని కోరుతూ బుధవారం ఎంపీ హరీష్‌మాధుర్‌కి, ఏపీ రాష్ట్ర ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. అమలాపురంలో ఎంపీని కలిసి బొకేతో అసోసియేషన్ సభ్యులు సత్కరించారు. ఈ మేరకు పై విధంగా కోరినట్టు రాష్ట్ర అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సీవీ రావు మీడియాకు తెలిపారు. అలాగే ఇందుకు ఎంపీ అంగీకారం తెలిపారన్నారు. వెంట ఎస్.మీనన్, సీహెచ్ నగేష్ ఉన్నారు.

బస్ సౌకర్యం కల్పించిన ఎమ్మెల్యే

సఖినేటిపల్లి: మండలంలోని పల్లిపాలెం విద్యార్థులకు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ బుధవారం బడి బస్సు సౌకర్యం కల్పించారు. విద్యార్థులు చదువు నిమిత్తం ఇతర ప్రాంతాలకు రాకపోకలకు బస్ లేక ఇబ్బందులు పడుతున్నట్టు స్థానికులు పొన్నాల విజయ్, జయకృష్ణ, ధోని, పరమేష్, స్వామిలు, ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే, రాజోలు ఆర్టీసీ డిపో మేనేజర్‌తో మాట్లాడి, బస్ సర్వీస్‌కై ఆదేశించారు. దీంతో విద్యార్థులు రాకపోకలకు ఇప్పటివరకూ ఉన్న సమస్య తొలగినట్టయింది.

అభివృద్ధి పనుల పరిశీలన

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం ఎంపీడీఓ ఎ.రాజు పరిశీలించారు. ఎన్‌ఆర్‌జీఈఎస్, 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన సీసీ రో డ్లు, డ్రైనేజీలను పరిశీలించి సిబ్బందికి సలహాలు అందజేశారు. నాణ్యతా ప్రమాణాలకు లోబడే నిర్మాణ పనులు ఉండాలన్నారు. చొప్పెల్ల, మూ లస్థానఅగ్రహారం, బడుగువానిలంక, చెముడులంక తదితర గ్రామాల్లో సుమారు రూ. కోటితో ఈ పనులు జరుగుతున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

రావులపాలెం: మండలంలోని ఈతకోట సెక్షన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అమలాపురం ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ బుధవారం తెలిపారు. ముమ్మిడివరప్పాడు సబ్ స్టేషన్ పరిధిలో గోపాలపురం ఫీడర్, ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలో గోపాలపురం , ముమ్మిడివరప్పాడు, ఈతకోట గ్రామాలకు విద్యుత్ ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అధికారులు హాజరయ్యేలా చర్యలు తీసుకోండి

రాజోలు: గ్రామాల్లో నిర్వహించే ఎస్సీ, ఎస్టీ చట్టాల అవగాహన సదస్సులకు మండల స్థాయి అధికారులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ డిప్యూటీ డైరెక్టర్ బి.జీవన్ కుమార్ పుత్రకు దళిత చైతన్య వేదిక నాయకులు పొలమూరి శ్యాంబాబు, బత్తుల మురళీకృష్ణలు బుధవారం ఫిర్యాదు చేశారు. పౌర హక్కుల దినోత్సవంలో భాగంగా గత రెండు నెలల్లో నిర్వహించిన సదస్సులకు మండల స్థాయి అధికారులు గైర్హాజరయ్యారని ఫిర్యాదులో పేర్కొన్నారు. క్రమం తప్పకుండా ఎస్సీ, ఎస్టీ సదస్సులకు మండల స్థాయి అధికారులు హాజరై చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

గ్రామాల్లో పొలం పిలుస్తోంది



మోరిపోడు రైతులతో ర్యాలీ నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

సఖినేటిపల్లి: మండలంలోని మోరిపోడు, మోరి గ్రామాల్లో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులతో ర్యాలీలు, సమావేశాలను అధికారులు నిర్వహించారు. వరి పంటపై ఆశించే తెగుళ్లు, వాటి నివారణ, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు గురించి ఏవో పీవీ నరసింహారావు ఆయా సమావేశాలలో రైతులకు వివరించారు. ఉద్యాన శాఖ, వ్యవసాయ శాఖ సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఆలమూరులో..

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం రైతుల అభ్యున్నతి కోసం ఎప్పటికప్పుడు అధునాతన పద్ధతులను తెలియజేసేందుకు నిర్వహిస్తున్న పొలంబడిని రైతులు సద్వినియోగించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఓలేటి బోసుబాబు తెలిపారు. మండలంలోని సంధిపూడిలో బుధవారం ఏడీఏ కాకి నాగేశ్వరరావు, ఏవో ఎస్.లక్ష్మీలావణ్య ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి బోసుబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలను వివరించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు సరైన గిట్టుబాటు ధర కల్పించేందుకు జిల్లా వ్యాప్తంగా సుమారు 350 ఆర్బీకేలను ఏర్పాటు చేశామన్నారు. ధాన్యం విక్రయించిన 48 గంటల్లో సంబంధిత రైతు ఖాతాకు సొమ్ము జమ చేసేందుకు వ్యవసాయశాఖ చర్యలు తీసుకుంటుందన్నారు. అనంతరం వివిధ గ్రామాల్లో పర్యటించి ధాన్యం రాశులను పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

అంబాజీపేట: శాఖా గ్రంథాలయ వారోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమవు తాయని గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ జి.శ్రీనివాస్ తెలిపారు. నిర్వహించే వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో విద్యార్థులు పాల్గొనేలా ప్రధానోపాధ్యాయులు సహకరించాలని శ్రీనివాస్ కోరారు. 14న గ్రంథాలయ వారోత్సవాలు, ప్రారంభం, బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శనలు, 16న గ్రంథాలయ ఉద్యమంలో ప్రముఖ వ్యక్తుల చరిత్ర వివరణ, 17న రచయితల సందేహాలు, సెమినార్లు, కవి సమ్మేళనాలు, 18న విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన, క్విజ్ పోటీలు, 19న మహిళా దినోత్సవంలో భాగంగా వివిధ కార్యక్రమాలు, 20న డిజిటల్ గ్రంథాలయాలు, 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలను నిర్వహించనున్నట్లు శ్రీనివాస్ తెలిపారు.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: అంతర్వేదిపాలెం శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్టు గ్రంథాలయ నిర్వాహకురాలు వై.వెంకటలక్ష్మి బుధవారం తెలిపారు. వివిధ అంశాల్లో పోటీల్లోని విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయలుగా నిర్ణయించి, బహుమతులు, యోగ్యతా పత్రాలను పంపిణీ చేయనున్నట్టు ఆమె అన్నారు.

మండలిలో మన గొంతు వినిపిస్తా..

కొత్తపేట: త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే విద్యారంగ సమస్యలపై ఉపాధ్యాయుల గొంతు వినిపిస్తానని పీడీఎఫ్ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి బొర్రా గోపీమూర్తి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన బుధవారం మండలంలోని ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమావేశాల్లో మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందన్నారు. 26 ఏళ్ల నుంచి అనేక విద్యార్థి, ఉపాధ్యాయ, అధ్యాపక సమస్యలపై ప్రత్యక్ష పోరాటాల్లో పాల్గొన్నానని తెలిపారు. విద్యారంగ సమస్యలపై సామాన్యుల గొంతును శాసనమండలిలో వినిపిస్తానన్నారు. డిసెంబరు 5న జరగనున్న ఎన్నికల్లో ప్రథమ ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని కోరారు. ఆయన వెంట పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఉన్నారు.

పంట బోదెలో కారు బోల్తా

పి.గన్నవరం: ఆర్‌పీ రోడ్డులో మండలంలోని బెల్లంపూడి వద్ద బుధవారం తెల్లవారుజామున ఒక కారు అదుపుతప్పి బోల్తా పడిన ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. మరో ఇద్దరు ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. పి.గన్నవరం మండలానికి చెందిన కె.సత్యనారాయణ తన కుటుంబంతో కొంతకాలంగా శ్రీకాకుళంలో ఉంటున్నారు. పి.గన్నవరంలో జరగనున్న ఒక కార్యక్రమానికి ఆయన భార్య, కుమారుడు, కోడలు, మనుమడు నలుగురు కలసి కారులో ఇక్కడికి వస్తున్నారు. తెల్లవారు జామున బెల్లంపూడి వద్ద వారు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి పంట బోదెలో పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో సత్యనారాయణ భార్య, కుమారుడికి గాయాలు కాగా అమలాపురంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కోడలు, మనుమడు సురక్షితంగా బయట పడ్డారు.

అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం

సఖినేటిపల్లి: 104 ఉద్యోగుల సమస్యలపై సదరు సిబ్బంది బుధవారం రామేశ్వరంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద వినతిపత్రం అందజేశారు. 104 వ్యవస్థను పీహెచ్‌సీల ద్వారా నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలని, జీవో నెం.7 వర్తింపచేయాలని, ప్రతి నెల సక్రమంగా వేతనాలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ఇంక్రిమెంట్స్ అందరికీ అందజేయాలని ఆ పత్రంలో కోరారు. సఖినేటిపల్లి పీహెచ్‌సీ డ్రైవర్ విజయ్, డీఈవో రుద్ర ప్రసాద్, శ్రీనుబాబు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అనారోగ్య బాధితుడికి ఆర్థిక సాయం



బాధితుడికి సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు బుధవారం రూ.15 వేల ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని దేవరపల్లి గ్రామానికి చెందిన యార్లగడ్డ సూర్యచక్రవర్తి (40)ఊపిరితిత్తులు, కిడ్నీ, లివర్ పాడైపోయి కడుపులో నీరు పడటం వల్ల 10 రోజులకోసారి హాస్పిటల్‌కి వెళ్లి నీరు తీయించుకోవాల్సిన పరిస్థితి. దీంతో వైద్యం చేయించుకోలేని పరిస్థితుల్లో వారు కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సా యం కోరారు. దేవరపల్లిలోని వాళ్ల ఇంటికి వెళ్లి వైద్యం నిమిత్తం రూ.15 వేల ఆర్థిక సాయంగా అందజేశారు.

మెగా వైద్య శిబిరం

అయినవిల్లి: మండలంలోని వెలువలపల్లిలో స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకుడు ఆందే నాగ గణపతి (గనిభాయ్) ఆధ్వర్యంలో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కాకినాడ చైతన్య డయాగ్నోస్టిక్ సెంటర్ ఆస్పత్రి వైద్యుడు స్వరూప్ 200 మందికి రోగులను పరీక్షించారు. గనిభాయ్ రూ.40 వేలు విలువైన మందులను రోగులకు ఉచితంగా పంపిణీ చేశారు. గనిభాయ్ రాష్ట్ర వ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, ఎందరికో కష్టకాలంలో సహాయ సహకారాలు అందిస్తూ పలువురి మన్ననలు పొందారని గ్రామ పెద్దలు తెలిపారు.